క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని కోటారెడ్డి నగర్‌లో విద్యుత్‌లైన్ మరమ్మతు పనులు ఉన్నందున సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విపీ ఫీడర్ నందు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ టీవీ నరశింహం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తూర్పువడ్డిపాలెం, తూర్పుకమ్మపాలెం, తూర్పుశాలిపాలెం, మారెమ్మమిట్ట, దివి లింగయ్యనాయుడు ఇంటి ఏరియా, కోటారెడ్డినగర్, క్లబ్‌రోడ్, ఆదియేంద్ర కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సోలారు సెట్ చోరీ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని దొడ్డిచింతల ఇరిగేషన్ చెరువు కింద నారు మడి చుట్టూ రక్షణగా ఏర్పాటు చేసిన సోలార్ సెట్ చోరీకి గురైంది. వివరాల్లోకి వెళితే.. రైతు సండ్లూరి వెంకటేశ్వర్లు ఇచ్చిన సమాచారం మేరకు మాగాణి భూమిలో వరినారు మడి సాగు చేశాడు. రాత్రిళ్లు అడవి పందులు, ఇతర జంతువులు రాకుండా చుట్టూ కర్రలు పెట్టి సోలార్ ఏర్పాటు చేశాడు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సోలార్ సెట్‌ను అపహరించారు. ఈ మేరకు రైతు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

చదవడం అలవాటు చేసుకోవాలి


చాకిచర్లలో చదవడం మాకిష్టం కార్యక్రమం

ఉలవపాడు: పుస్తకం చదవడం ప్రతి ఒక్క చిన్నారి అలవాటు చేసుకోవాలని గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు అన్నారు. ఉలవపాడులోని శాఖ గ్రంథాలయం, చాకిచర్ల బుక్ డిపాజిట్ సెంటర్‌లో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడే ఎన్నో పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయని వాటిని చదివి విద్యార్థులు జ్ఞానం సంపాదించుకోవాలన్నారు. విద్యార్థులతో నీతి కథలు చదివించారు.

హెల్మెట్ వాడి ప్రమాదాల నుంచి రక్షణ పొందండి


హెల్మెట్ వాడకం ప్రాధాన్యంపై అవగాహన చేస్తున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

సీఎస్‌పురం(పామూరు): ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ వాడి ప్రమాదాల నుంచి రక్షణ పొందాలని ఎస్సై బి.ప్రేమ్‌కుమార్ అన్నారు. హెల్మెట్ వాడకంవల్ల ప్రయోజనాలు, వాడకపోతే నష్టాలపై వివరిస్తూ ఆదివారం సాయంత్రం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ద్విచక్రవాహనాలు నడిపే వారిపై కేసులు నమోదుచేస్తామన్నారు. హెల్మెట్ ధరించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రమాదాల్లో యజమాని మృత్యువాతపడితే కుటుంబం మొత్తం కష్టాలపాలవుతుందని గ్రహించాలన్నారు.

అనాథ పిల్లలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న సంస్థ సభ్యులు

టంగుటూరు: టంగుటూరులో 1995–96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మనం ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని బొమ్మరిల్లు అనాథ శరణాలయంలోని అనాథ పిల్లలకు అన్నదానం కార్యక్రమం చేశారు. అనంతరం ఆర్గనైజేషన్ సభ్యులను అభినందించారు.

డిగ్రీ ఫలితాల్లో ప్రతిభ


ఎం జయలక్ష్మి


ఏ శ్రావణి

కనిగిరి రూరల్: ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం డిగ్రీ రెండో సెమిష్టర్ ఫలితాల్లో స్థానిక ఏఎల్ఎస్ఎం వైష్టవీ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. బీఎస్సీ జువాలజీలో ఎం జయలక్ష్మి జీపీఏ 8.87/10.0 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించగా, బీసీఏలో ఏ శ్రావణి జీపీఏ 8.53/10.0 మార్కులతో టౌన్ టాప్‌లో నిలిచింది. బీఎస్సీ బాటనీలో ఎన్ గాయత్రి 8.21/10.0 మార్కులతో టౌన్ టాప్, బీకాం కంప్యూటర్‌లో భవాని 8.21/10.0 మార్కులతో టౌన్ ఫస్ట్, బీఏ పబ్లిక్ అడ్మిస్టేషన్ నందు వీ ప్రీతి 7.59/10.0 మార్కులతో టౌన్ ఫస్ట్ ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ రామన విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ నారబోయిన వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థినులను అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎస్ఎంసీ ఎన్నికల సందడి షురూ..

- నేడు ఓటర్ల జాబితా సిద్ధం
- 8న కమిటీల ఎన్నిక

కనిగిరి రూరల్:

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల సందడి షురూ అయ్యింది. ఆరు మండలాల్లో 458 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా వాటిలో సుమారు 28,500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈనెల ఒకటో తేదిన ఆయా పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి అన్ని స్కూళ్లలోని నోటీసు బోర్డుల్లో నోటిఫికేషన్ ప్రతులను అంటించారు. ఈ నెల 5న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయడం, అదే రోజు 3 నుంచి 5 గంటల లోపు తుది జాబితా సిద్ధం చేస్తారు. ఆగస్టు 8వ తేది ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రత్యేక్ష పద్ధతిలో చేతులు ఎత్తడం ద్వారా ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికైన సభ్యులు ఎస్ఎంసీ చైర్మన్‌ను, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుంది. సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల లోపు కొత్త కమిటీ సమావేశం జరుగుతుంది.

నియోజకవర్గంలో 458 పాఠశాలలు ఎన్నిక

కనిగిరి నియోజకవర్గలలోని ఆరు మండలాల్లో సుమారు 458 పాఠశాలల్లో ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించేందుకు విద్యా శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చోట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తారు. ఎన్నికైన సభ్యులతో పాటు ప్రధానోపాధ్యాయులు లేదా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. సంబంధిత గ్రామ పంచాయతీ సర్పంచ్, మున్సిపల్ చైర్మన్ మేయర్‌లు వారి ప్రాంతాల్లో ఎప్పుడైనా ఎస్ఎంసీ సమావేశాలకు వారి ఇష్టాపకారం హాజరుకావచ్చు.

నియోజకవర్గంలో ఇవి ప్రతిష్టాత్మకం..

నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా గతంలో ఎన్నికలు జరిగినా ఎక్కడా ఎన్నికలు వాయిదా పడలేదు. ప్రశాంతంగా ముగిశాయి. ఒక్క హనుమంతునిపాడు మండంలోని వాలిచర్ల ఉన్నత పాఠశాల మాత్రమే 12 సార్లు వాయిదా పడింది. కనిగిరి పట్టణంలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాల, మోడల్ స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మండలంలోని కంచర్లవారిపల్లి, గురువాజీపేట, ఏరువారిపల్లి, తాళ్లూరు, దిరిశవంచ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నిక పోటాపోటీగా జరిగినా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పామూరు మండలంలోని అయ్యన్నకోట, బోడవాడ, పీసీపల్లి మండలంలో పెద ఇర్లపాడు స్కూల్‌లో, సీఎస్‌పురం మండలంలో నాగులవరం, చెన్నపునాయిని పల్లి పాఠశాలలు, హెచ్ఎంపాడు మండలంలో సీతారాంపురం, హనుమంతునిపాడు, నందనవనం స్కూల్‌లలో గతంలో ప్రతిష్టాత్మకంగా ఎస్ఎంసీ కమిటీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయి.



కనిగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఎన్నికల విధానం ఇది:

- పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎన్నికలు నిర్వహించాలి. ఈమేరకు తొలుత తల్లిదండ్రుల కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలి. 59 శాతం మంది మంది తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలి.
- తల్లిదండ్రులు లేదా సంరక్షకులు తమ పిల్లలు ఎన్నిక తరగతుల్లో ఉంటే అన్ని తరగతుల్లో ఎన్నిక విధానంగా పాల్గొనవచ్చు. కానీ సభ్యులను ఎన్నుకునేందుకు ఓటు వేసేందుకు ఒక్కరికే అవకాశం ఉంటుంది.
- సాధారణంగా చేతులు ఎత్తే ప్రక్రియ లేదా చెప్పడం ద్వారా ఎన్నిక జరగాలి. ఆసాధారణ పరిస్థితిల్లో బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలి.

నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల వివరాలు:

మండలం	పాఠశాలల సంఖ్య
కనిగిరి	116
హెచ్ఎంపాడు	66
పీసీపల్లి	59
సీఎస్‌పురం	83
పామూరు	88
వెలిగండ్ల	66
మొత్తం	458

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికలు:



ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాట్లు చేశాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో నోటిఫికేషన్‌ను తగిలించాం. ఎన్నికల షెడ్యూల్, ఎన్నిక ప్రక్రియ విధానం గూర్చి ప్రకటించాం. 8న తేదిన ఎన్నికలు జరిగే రోజు అవసరమైన చోట పోలీస్ బందోబస్తు కోరుతాం. తల్లిదండ్రుల సహకారంతో నిబంధనల ప్రకారం ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహిస్తాం.

– యువీ నారాయణరెడ్డి, ఎంఈఓ


గోపూజలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం మహానివేదన, గోపూజ, అభిషేకోత్సవం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్‌శర్మ వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నూతనంగా నిర్మించిన గోశాలలో గోపూజ నిర్వహించారు. ఉదయాన్నే నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం అభిషేకోత్సవం నిర్వహించి అర్చకులు మహానైవేద్యంతో భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి స్వామికి నైవేద్యంగా సమర్పించారు. బయసాని మధుసూదనరావు, ముడుమాల నారాయణరెడ్డి, దాదం సుబ్బరాయుడు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ, భక్తులు

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు: ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగ పెన్షనర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల సంఘ గౌరవాధ్యక్షుడు ఆర్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను విడుదల చేయాలని, ఈహెచ్ఎస్ క్యాష్‌లెస్ సౌకర్యాన్ని హాస్పిటళ్లు అనుమతించడం లేదని, ఆ కార్డులు నిరుపయోగంగా మారాయని చెప్పారు. ప్రభుత్వం ఈ కార్డులు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుద్ధ సమాజం ప్రతినిధి గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ నేత్రదానం, అవయవదానం గురించి వివరించారు. మరణించిన తరువాత చేసే నేత్రదానం వల్ల నలుగురికి కంటిచూపు లభిస్తుందని, ప్రమాదంలో బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబసభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకు వస్తే అనేక మందికి ప్రాణదానం చేసినవారు అవుతారని వివరించారు. ఇప్పటికే పెద్ద పట్టణాల్లో అనేక మంది అవయవదానికి ముందుకు వచ్చి ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం చేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘ ధ్యక్షుడు చిమ్మిరి నరశింహం, ఇంటూరి మాల్యాద్రి, చెన్నయ్య, కృష్ణారావు, శ్రీనివాసులు, గణపతిరాజు, శేషగిరిరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఉద్యమాలతోనే పార్టీ బలోపేతం

పామూరు: ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలతో మమేకమై ఉద్యమాలు చేసినప్పుడే ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం అవుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక గుజ్జుల యల్లమందారెడ్డి భవన్‌లో పాలపర్తి మస్తాన్‌రావు అధ్యక్షతన మండల సమితీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ప్రజా సమస్యలు గుర్తించి ప్రజా ఉద్యమాల ద్వారా వాటిని పాలకులు, అధికారుల దృష్టికి తీసుకుపోయి పరిష్కరించి ప్రజామన్ననలు పొందాలన్నారు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ మనకబారుతోందని, దక్షిణాది రాష్ట్రాల్లో మతోన్మాదాన్ని రెచ్చగొట్టి బీజేపీ బలం పుంజుకోవాలని, చూస్తోందని దీన్ని సీపీఐ శ్రేణులు తిప్పికొట్టాలన్నారు. 2025 డిసెంబర్ 25 నాటికి భారత కమ్యూనిష్టు పార్టీ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తవుతున్న దృష్ట్యా దేశవ్యాప్తంగా సంబరాలకు సిద్ధం కావాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్‌యాసిన్ మాట్లాడుతు ప్రతి కార్యకర్త పార్టీ కోసం రోజుకు గంటయినా కేటాయించాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ

బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


ఘటనా స్థలంలో క్షతగాత్రుడు నారాయణ

సీఎస్‌పురం(పామూరు): ఎదురెదురుగా వస్తున్న బైక్‌లు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం రాత్రి సీఎస్‌పురం గ్రామ సమీపంలో భారత్‌గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపంలో జరిగింది. కోవిలంపాడు గ్రామానికి చెందిన డోలా నారాయణ సీఎస్‌పురంలో సొంత పని ముగించుకుని బైక్‌పై ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. భారత్‌గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం సమీపానికి వచ్చే సరికి కోవిలంపాడు నుంచి సీఎస్‌పురం వైపుకు వేగంగా వస్తున్న మరోబైక్ నారాయణ ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఘటనలో నారాయణ కుడికాలు విరగ్గా 108 వాహనంలో పామూరు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం క్షతగాత్రున్ని ఒంగోలు తరలించారు.

ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం

సింగరాయకొండ: ఎస్సీ వర్గీకరణతో సామాజిక న్యాయం సాధ్యమని ఎంఈఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు టి.విజయానంద్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు నిర్ణయాధికారం ఇస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంపై స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్‌లోని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఆదివారం సంబరాలు నిర్వహించారు. విజయానంద్ మాట్లాడుతూ.. ఈ తీర్పు ఎస్సీల్లో అణగారిన వర్గాల ఆర్థికాభివృద్ధికి ఎంతో ఉపయోగమన్నారు. ఎండ్లూరి రామయ్య, రావినూతల చంద్ర, రేణుమాల పోతురాజు, రేణుమాల గోవిందరావు, రేణుమాల సురేష్, పొనుగోటి శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

జమ్ములపాలెంలో చీకట్లు


జమ్ములపాలెం చెరువు సమీపంలో క్షుద్రపూజలు చేసిన ఆనవాళ్లు

టంగుటూరు: మండలంలోని జమ్ములపాలెంలో వీధి దీపాలు లేకపోవడంతో గ్రామస్తులు చీకట్లో కష్టాలు పడుతున్నారు. చీకట్లో నడవాలంటే విష పురుగులతో భయంగా ఉందని, దీనికితోడు వీధి కుక్కలు అధికంగా సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామ చెరువు ప్రాంతంలో రాత్రి వేళల్లో నడిరోడ్డుపై పూజలు చేసిన ఆనవాళ్లు ఉండటం అందరినీ కలవరపెడుతోంది. పంచాయతీ అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలల నిరసన



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలలు

సింగరాయకొండ: ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని కావున ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తున్నామని మాలలు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని పాకల అంబేడ్కర్ నగర్‌లో ఆదివారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలలు తమ నిరసన తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు పనిగట్టుకుని ఎస్సీల మధ్య విభేదాలు సృష్టిస్తున్నాయని ఆరోపించారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం


మహిళా కళాశాలలో స్నేహితుల దినోత్సవ వేడుకలు


స్నేహితుల దినోత్సవంలో పూర్వపు విద్యార్థులు

కనిగిరి రూరల్: స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో, సీనియర్ సిటిజన్లు, పూర్వ విద్యార్థులు, చిరకాల స్నేహితులు, మిత్రులు ఒకరినొకరు స్నేహితుల దినోత్సవం ప్రత్యేకంగా, పరోక్షంగా శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పలు ప్రాంతాల్లో అందరూ ఒకటిగా చేరి కేక్ కట్ చేసి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యార్థులు, యువత ఫ్రెండ్‌షిప్ బాండ్‌లను తగిలించుకొని సందడి చేశారు.

ఘనంగా కాలభైరవస్వామికి పూజలు

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కె.బిట్రగుంట గ్రామ పంచాయతీలోని ప్రసన్న కాలభైరవస్వామి దేవస్థానంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బూడిద గుమ్మడి కాయల్లో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. సుమారు రెండు వేల మందికి అన్నసంతర్పణ చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు నిర్వాహకులు పాపిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో ఆ ప్రాంతం తిరునాళ్లను తలపించింది.


ప్రత్యేక అలంకరణలో కాలభైరవస్వామి


ఆలయానికి పోటెత్తిన భక్తులు

జూదరులు అరెస్టు

మద్దిపూడి: మండలంలోని కెల్లంపల్లి శివారులో పేకాట శిబిరంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న రూ.23,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శివబసవరాజు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు చెప్పారు.

సింగరాయకొండ: మండల కేంద్రంలోని లారీ యూనియన్ ఆఫీసు వద్ద పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. 8 మందిని అరెస్టు చేసి, వారి నుంచి 2,330 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై టి.శ్రీరామ్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్సై చెప్పారు. అలాగే పాకల పంచాయతీ పోతయ్యగారిపట్టపుపాలెం వద్ద కోడి పందెం శిబిరంపై దాడిచేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుల నుంచి రెండు కోళ్లు, 2350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని తెలిపారు.

పిల్లలు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

టంగుటూరు: పిల్లలు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ నిర్వాహకుడు జి.వర్ధనరాజు సూచించారు. స్థానిక గ్రంథాలయంలో ఆదివారం చదవటం మాకిష్టం కార్యక్రమం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో నిర్వహించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తూ, పుస్తకాలు చదివే అలవాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.


గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు